మరో రెండు నెలల్లో అందుబాటులోకి ఛే నంబర్ ఫ్లైఓవర్

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, అక్టోబర్ 20 : అంబర్‌పేట ఛే నంబర్‌లో నిర్మాణమవుతున్న ఫ్లైఓవర్‌ను మరో రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అంబర్‌పేటలో మీడియాతో మాట్లాడారు. ఫ్లైఓవర్ నిర్మాణం కోసం స్థల సేకరణ విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆలస్యమవుతుందని ఆరోపించారు. స్థల సేకరణ విషయంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే జాప్యం జరుగుతుందన్నారు. దీనిపై ఇప్పటికే అనేకమార్లు సమీక్షించడం జరిగిందని పేర్కొన్నారు. రెండు స్థలాలకు సంబంధించిన స్థల సేకరణ పూర్తయితే ఇరువైపులా సర్వీస్ రోడ్డును పునరుద్ధరిస్తామన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి అన్ని పనులు పూర్తయ్యాయని, ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారం ప్రారంభం

అంబర్‌పేట, అక్టోబర్ 20 : గోల్నాక డివిజన్, జైస్వాల్‌గార్డెన్ కాలనీలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన ముఖ ద్వారాన్ని స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ ముఖ ద్వారం చిరునామాకు సంకేతంగా ఉంటుందన్నారు. ఆర్చి నిర్మాణ దాతలు కాలనీ వెల్ఫేర్ చైర్మన్ ఎ.రామాగౌడ్, శ్రీమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అడ్వకేట్ జి.ప్రసన్నాంజనేయుల సహకారంతో ఈ ముఖ ద్వారం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

రేణుక ఎల్లమ్మ దేవాలయ వ్యవస్థాపకుడు సత్యేందర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్వార్టర్స్‌లోని రేణుక ఎల్ల మ్మ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు తీ ర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను సత్కరించారు. విశ్రాంత ఏసీపీ రాజ్‌కుమార్, కన్నె రమేశ్‌యాదవ్, భీమాగౌని కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాము, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. – *కాచిగూడ, అక్టోబర్ 20*

తెలుగు వర్సిటీ ప్రతిష్టను పెంచండి

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 20: తెలుగు భాషా, సంస్కృతులు, కళలను పరిరక్షించి భావితరాలకు అందించాలనే లక్ష్యంతో నాటి మహనీయులు ఏర్పాటు చేసిన తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్టను మరింతగా పెంచాలని ఆచార్య నిత్యానందరావుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి సూచించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన ఉపాధ్యక్షులుగా నియమితులైన ఆచార్య వెలుదండ నిత్యానందరావు ఆదివారం తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ రమణాచారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

లాఠీచార్జి చేసిన పోలీస్‌అధికారులను సస్పెండ్ చేయాలి

సుల్తాన్‌బజార్, అక్టోబర్ 20: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయం వద్ద జరిగిన లాఠీచార్జికి పాల్పడిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. కోఠిలోని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ భక్తులు, బజరంగ్‌దళ్ కార్యకర్తలపై అకారణంగా లాఠీచార్జి చేయడం ఏమిటని ప్రశ్నించారు. హిందూ దేవాలయాలపై వరుసగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని ఆరోపించారు. వీహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు సునీత, సహకార్యదర్శి భానుప్రసాద్, సుభాష్‌చందర్ పాల్గొన్నారు.

అలరించిన నిశికరెడ్డి భరతనాట్యం

రవీంద్రభారతి,అక్టోబర్ 20: ప్రముఖ నాట్య గురువు డాక్టర్ రాజేశ్వరి సాయినాథ్ శిష్యురాలు మాజీరెడ్డి నిశికరెడ్డి ఆదివారం రవీంద్రభారతిలో భరతనాట్య అరంగేట్రం చేసి ప్రేక్షకులను, నాట్యగురువును కట్టిపడేసింది. చక్కని అభినయం.. భరతనాట్యాంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి, పూర్వ సంగీత నాటక అకాడమీ చైర్మన్ బాద్మీ శివకుమార్‌లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి నిశికరెడ్డి భరతనాట్య అరంగేట్రంను ప్రారంభించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నిశి కరెడ్డి తల్లిదండ్రులు మాజీరెడ్డి జలంధర్‌రెడ్డి, మాజీరెడ్డి పద్మజారెడ్డి, ప్రముఖులు , అభిమానులు పాల్గొన్నారు.

1969 ఉద్యమకారులకు పెన్షన్లు ఇవ్వాలి

కాచిగూడ,అక్టోబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం1969 తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్లు ఇవ్వాలని 1969 తెలంగాణ విద్యార్థి జేఏసీ కన్వీనర్ గోపాల్‌రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నింబో లి అడ్డా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ..ఉద్యమకారులు 70 ఏండ్లకు పైబడి ఉండడంతో అనేక అనారోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారని, ఉద్యమకారుల సేవలను గుర్తిం చి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.1969 తెలంగాణ ఉ ద్యమంలో పాల్గొన్న విద్యార్థి కుటుంబాలకు పెన్షన్, ఉచిత వైద్యం, ఇండ్ల స్థలాలు, బస్సులో ఉచిత ప్రయాణం అందించాలన్నారు.

అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కాచిగూడ, అక్టోబర్ 20: ప్రజా సమస్యలను పరిష్కరించడం లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. జీఓ 29వల్ల లక్షలాది మంది విద్యార్థులు గ్రూప్–1 చదవలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. హైడ్రా బాధితులు, గ్రూప్–1 విద్యార్థులతో చెలగాటం ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనతో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఛీ కొడుతున్నారని అన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మెహిదీపట్నం అక్టోబర్ 20: ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ డివిజన్ ఏసీపీ ధన లక్ష్మి అన్నారు. ఆదివారం ఆసిఫ్‌నగర్–మల్లేపల్లి ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొ లగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణగౌడ్ ,అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన

మెహిదీపట్నం అక్టోబర్ 20 : నాంపల్లి నియోజకవర్గం, ఆసిఫ్‌నగర్‌లోని జేబాబాగ్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్యజనని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గర్భిణులకు ప్రెగ్నెన్సీ కేర్‌పై అవగాహన నిర్వహించారు. అనంతరం పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో గర్భావస్థలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యోగా, ధ్యానం, తదితర అంశాలపై ఆర్యజ నని ట్రస్ట్ సభ్యురాలు అవని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో అధికారి రేణుక, సూపర్‌వైజర్ రమ్య, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే

మెహిదీపట్నం అక్టోబర్ 20: రోగులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించడానికి డాక్టర్లు కృషి చేయాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్ నీలోఫర్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడిన అనంతరం వారికి పండ్లను పంచారు. కార్పొరేటర్ ప్రతినిధి అరీఫ్ రిజ్వాన్ పాల్గొన్నారు.

అయ్యప్ప గురుస్వాములకు సన్మానం

అంబర్‌పేట, అక్టోబర్ 20: మహాశాస్త్ర సేవా సంఘం చైర్మన్ డా.రాజు గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప గురుస్వాములను సన్మానించారు. ఈ సందర్భంగా అంబర్‌పేటకు చెందిన ధర్మశాస్త్ర సేవా సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రమౌళి గురుస్వామిని కూడా సత్కరించి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో దూసరి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో విశ్వకర్మ కులంగా నమోదు చేసుకోవాలి

రవీంద్రభారతి, అక్టోబర్ 20 : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే కులగణనలో కమ్మరి, వడ్రంగి, కంచరి, శిల్పి, స్వర్ణకార వృత్తిదారులంతా విశ్వకర్మ కులంగా నమోదు చేసుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ కోరింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ అధ్యక్షుడు కౌలె జగన్నాథం చారి, ప్రధాన కార్యదర్శి లింగాచారి మాట్లాడుతూ.. దశాబ్దాల తర్వాత కులగణన చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాసభ కార్యదర్శి గంగాధర్, లక్ష్మణాచారి, రామాచారి, మహిళా నాయకులు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మహ్మద్ రఫీ మ్యూజికల్ నైట్

సుల్తాన్‌బజార్ : నగరంలోని సంగీత ప్రియులకు నాంపల్లిలోని గాంధీ భవన్ ప్రకాశం హాల్ వేదికైంది. సుప్రసిద్ధ గాయకుడు మహమ్మద్ రఫీ జన్మశతాబ్ది(100వ పుట్టిన రోజు)ను పురస్కరించుకొని.. మధు మ్యూజిక్ అకాడమీ 27వ వార్షికోత్సవం సందర్భంగా మహమ్మద్ రఫీ మ్యూజికల్ నైట్‌ను అకాడమీ వ్యవస్థాపకులు ఎంఎల్ కాంతా రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇది అందరినీ అలరించింది.

నింబోలిఅడ్డాలో అన్నదానం

కాచిగూడ,అక్టోబర్ 20: బాటసారులు, పేదల ఆకలిని తీర్చడానికి అన్నదానాలు ఎంతగానో దొహదపడుతాయని మాజీ మంత్రి కృష్ణయాదవ్ అన్నారు. సంఘ సేవకుడు శాస్త్రీ ఆధ్వర్యంలో ఆదివారం నింబోలిఅడ్డాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. దీనికి కన్నె రమేశ్‌యాదవ్‌తో కలిసి ఆయన హాజరై అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుభాశ్‌పటేల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.